# మన జనప్రగతి

తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం


సంపుటి : 6 సంచిక : 145 పేజీలు : 8 వెల : రూ.2/- ఆదివారం 21 జూన్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకున్నాం

**- రైతులు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది**

- 48 గంటల్లో ధాన్యం కొనుగోలు మొత్తాన్ని జమచేస్తున్నాం
- రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలి
- ఆంధ్రాను మించి తెలంగాణ ధాన్యం పండిస్తోంది
- వైకాపా హయాంలో రైతులు నానా కష్టాలు పడ్డారు
- లింగగుట్లో అన్నదాత సుఖీభవ నిధులు విడుదల
- రైతులకు అండగా ఉంటామని ప్రకటించిన చంద్రబాబు





**పల్నాడు,మన జనప్రగతి జూన్ 20:** రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. దాన్ని నిలబెట్టుకున్నా మని సీఎం చంద్రబాబు అన్నారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగం గుంట్లలో 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' నిధులను విడుదల చేసిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు. నిధుల విడుదలకు సంబంధించి రైతులు తమ ఫోన్ ద్వారా వచ్చాయో లేదో చూసి చెప్పాలన్నారు. అక్కడే రైతులు ఫోన్లు ఊపుతూ వచ్చాయని సైగలు చేశారు. టెక్నాలజీ పెరగడంతో క్షణాల్లో వ్యవహారం తెలిసిపోతోందన్నారు. కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టినందుకు తాము నమ్మకంగా పనిచేస్తున్నామని అన్నారు. వైకాపా హయాంలో అన్నదాతలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని మిగతా2లో...

## ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

- రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని
- ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ
- అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన



**భువనేశ్వర్,మన జనప్రగతి జూన్ 20:** ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి మిగతా2లో...

## శాంతి ఒప్పందం వేళ మళ్లీ పీటముడి

**- హర్మూజ్ మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన**




## అరుదైన వ్యాధిగ్రస్తులకు సర్కార్ అండ

**ప్రత్యేక పాలసీని రూపొందిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ వెల్లడి**



**అమరావతి,మన జనప్రగతి జూన్ 20:** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుదైన వ్యాధిగ్రస్థులకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు ప్రత్యేక పాలసీ రూపొందించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. 'నేషనల్ పాలసీ ఫర్ రేర్ డిసీజెస్-2021'కు అనుగుణంగా నూతన పాలసీని త్వరగా తయారు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్య సేవలు, బాధితులకు తోడ్పాటును అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ చెప్పారు. అలాగే మూడు మిగతా2లో...

## ఖాళీ ఖజానా అప్పగించిన జగన్

- చంద్రబాబు దక్షతతో గాడిలో పడుతున్న రాష్ట్రం
- రైతులు సేంద్రియ పంటలవైపు మొగ్గాలి: అచ్చెన్నాయుడు



**పల్నాడు,మన జనప్రగతి జూన్ 20:** కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చేసరికి ఖజానా ఖాళీగా ఉందని, భయంభయంగానే పాలన మొదలుపెట్టామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అయినా ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. చంద్రబాబు నాయుడు దక్షతతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టామని అన్నారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని మిగతా2లో...

## పీఎం కిసాన్ డబ్బులు విడుదల

**రూ. 2,000 చొప్పున 18,880 కోట్లు జమ**

**హుగ్లీ జిల్లాలో విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ**



**కోల్‌కతా,మన జనప్రగతి జూన్ 20:** పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు పెట్టుబడి మిగతా2లో...

## దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- యోగాకు గుర్తింపు తెచ్చిన ఆధ్యాత్మిక వేత్త బాబా రాందేవ్
- ఉండవల్లి గుహల వద్ద అంతర్జాతీయ యోగా నిర్వహణ
- బాబాతో కలసి ఆసనాలు వేసిన చంద్రబాబు
- చంద్రబాబు విజనరీ నేత అన్న బాబా రాందేవ్



**అమరావతి,మన జనప్రగతి జూన్ 20:** దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాందేవ్ బాబా శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగా పక్రియలను రాందేవ్ బాబా సీఎంకు వివరించారు. బాబారామ్‌దేవ్‌తో కలిసి సీఎం యోగా సాధన చేశారు. రామ్‌దేవ్ శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. యోగాకు.. రాందేవ్ బాబా మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. యోగా సాధనతో ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. ఆయన శిక్షణలో యువత యోగాసనాలు మిగతా2లో...


## ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరు కండి

- ఎలాంటి ఒత్తిడికి గురికావదదన్న సిఎం రేవంత్
- నీట్ పరీక్ష సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు




## ఖతార్ పాలకుల ఔదార్యం

- ట్రంప్‌కు 747 జంబో జెట్ గిఫ్ట్
- ఆవిష్కరించిన అమెరికా అధ్యక్షుడు




**వాషింగ్టన్,మన జనప్రగతి జూన్ 20:** ఖతార్ పాలకులు తనకు గిఫ్ట్‌గా ఇచ్చిన 747 జంబో జెట్ విమానాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆవిష్కరించారు. ఇకనుంచి ట్రంప్ కొంతకాలం పాటు ఇందులోనే ప్రయాణాలు చేయనున్నారు. ఈ విమానాన్ని ఆయన 'ఎగిరే వైట్‌హౌస్'గా అభివర్ణించారు. జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో శుక్రవారం ఈ విమానం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇది ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన విమానం అని ట్రంప్ పేర్కొన్నారు. ఇందులోని ఇంటీరియర్ డిజైన్, ఇంజిన్ల నాణ్యత అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇది ఎయిర్‌ఫోర్స్ వన్ కంటే మిగతా2లో...

# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

(మొదటి పేజీ తరువాయి)

ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్వ' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

(మొదటి పేజీ తరువాయి)

అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందన్న సీఎం.. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని వివరించారు. బాబారామ్‌దేవ్ ఏదైనా చేయగలరన్నారు. యోగాకు.. రామ్‌దేవ్ మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. యోగా మన సంప్రదాయం, విజ్ఞానం, వారసత్వ సంపద అని చెప్పుకొచ్చారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని సీఎం అన్నారు. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని తెలిపారు. దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఏపీ మారనుందని పేర్కొన్నారు. ఉండవల్లి కొండల వద్ద యోగా.. చాలా అందమైన ఆలోచన అని అన్నారు. అమరావతి కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ నేషన్స్‌ను ఒప్పించి ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 31శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రాందేవ్‌బాబా మాట్లాడుతూ.. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం.. చంద్రబాబు అని కితాబిచ్చారు. ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సీఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే విజన్ ఉన్న నాయకుడని అన్నారు. గత 30 సంవత్సరాలుగా చంద్రబాబు ఏం అడుగుతారో.. తాము అది చేస్తున్నామని తెలిపారు. యోగా మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని రామ్‌దేవ్ బాబా తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అందర్నీ సమానంగా చూస్తారని.. అందుకే ప్రజలు ఆయన్ను దేవుడిలా భావిస్తారన్నారు. అమరావతి దేవతల రాజధాని అని.. ఇక్కడ 40 శాతం పచ్చదనం, 60 శాతం నిర్మాణాలు ఉంటాయన్నారు. ఇది దేవ భూమి అని వెల్లడించారు. స్విట్జర్లాంట్ కోసం వెళ్లాల్సిన అవసరం లేదని... ఆంధ్రప్రదేశ్ వస్తే చాలని చెప్పారు. ఇక్కడి మామిడికాయలు, అరటిపండ్లు చాలా బాగుంటాయని.. ఎందుకంటే వాటిని సహజ సిద్ధంగా పండిస్తారని తెలిపారు. ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' పేరుతో నిర్వహిస్తున్నామని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు.

# ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరు కండి

**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 20:** నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి ముఖ్యమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతోకాలంగా కృషి చేశారని పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదలపై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.



# మైనారిటీల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- బోయపల్లిలో టీఎంఆర్ఈఐఎస్ పాఠశాల ప్రారంభం
- కార్యక్రమంలో మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్



**మహబూబ్‌నగర్,మన జనప్రగతి జూన్ 20:** తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బోయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాల భవనాన్ని మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక విద్యా సంస్థలను అభివృద్ధి చేస్తోందన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, స్కాలర్‌షిప్‌లు, కోచింగ్ సౌకర్యాలు, పాఠ్యపుస్తకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తును బలోపేతం చేస్తున్నామని తెలిపారు. విద్యే అభివృద్ధికి మూలాధారం. ఎంత ఎక్కువగా చదువుకుంటే అంత ఎక్కువ అవకాశాలు లభిస్తాయి. విద్యార్థులు కష్టపడి చదివి తమ ప్రతిభను నిరూపించుకోవాలి. ప్రభుత్వం మీకు అవసరమైన ప్రతి సహకారం అందించడానికి సిద్ధంగా ఉంది' అని మంత్రి పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి దానిని మెరుగుపరుచుకోవాలని, క్రమశిక్షణ, అంకితభావం, కఠోర శ్రమ ద్వారానే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ఆయన సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి విజన్‌కు అనుగుణంగా తెలంగాణను విద్యా రంగంలో దేశానికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. సందర్భంగా హాజరైన ప్రజాప్రతినిధులు మరియు అధికారులు మైనారిటీ విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. బోయపల్లి టీఎంఆర్ఈఐఎస్ పాఠశాల భవనం విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిమ్రిస్ చైర్మన్ శ్రీ ఫహీమ్ ఖురేషి, తెలంగాణ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ఉబైదుల్లా కొత్వాల్, మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీ బి. షఫీయుల్లా, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డి.కె. అరుణ, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు, మైనారిటీల సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కమ్యూనిటీ నాయకులు, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

- వారం పాటు బెయిల్ మంజూరు చేసిన కోర్టు

**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 20:**కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు న్యాయస్థానంలో ఉపశమనం లభించింది. ఓ యువతిపై లైంగిక దాడి కేసులో అరెస్టై చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌కు మల్కాజ్‌గిరి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా భగీరథ్ జైలు జీవితం అనుభవిస్తున్నాడు. తాజాగా ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో న్యాయవాదులు మధ్యంతర బెయిల్ కోరారు. వాదనల విన్న కోర్టు నెల 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇదిలా ఉండగా.. గత నెలలో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అతడిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్న భగీరథ్ మే 17న ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయాడు. ఇక, నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు గతంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. మేడ్చల్ మేజిస్ట్రేట్ అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు. అంతకు ముందు రెండు గంటలకుపైగా సిట్ అధికారులు అతడిని విచారించారు. అప్పటి నుంచి నెల రోజులకు పైగా జైలు జీవితం గడిపిన భగీరథ్ తాజాగా బెయిల్‌పై బయటకు రానున్నాడు.



# ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకున్నాం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ప్రజలను కష్టాల్లోకి నెట్టడం తప్ప గొడ్డలి పార్టీకి మరేమీ తెలియదని విమర్శించారు. ఇవాళ యోగా, స్వచ్ఛాంధ్ర, అన్నదాత సుఖీభవ.. ఇలా మూడు మంచి కార్యక్రమాల్లో పాల్గొన్నాను. నా జీవితంలో ఇవాళ్టికి మించిన ఆనందం మరొకటి లేదన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం సృష్టించింది. విధ్వంసం నుంచి వికాసంవైపు తీసుకెళ్తామని మేం హామీ ఇచ్చాం. సంపద సృష్టించి.. రైతుల కష్టాలు తీరుస్తామని చెప్పాం. అన్నదాతలకు ప్రతి విషయంలో అండగా ఉన్నాం. బటన్ నొక్కగానే 99.8 శాతం మంది రైతులకు నిధులు జమయ్యాయి. గతంలో ధాన్యం కొని ఆరు నెలలైనా డబ్బులు వచ్చేవి కావు. మా ప్రభుత్వం 48 గంటల్లోనే డబ్బులు ఇస్తోందన్నారు. ఒకప్పుడు ఆంధ్ర అంటే వరి.. తెలంగాణ అంటే మెట్ట పొలాలు. ఇప్పుడు ఆంధ్రాను డామినేట్ చేసి తెలంగాణ వరిని పండిస్తోంది. మనం ప్రకృతి సేద్యం వైపు మళ్లాలి. ఎక్కువ రసాయనాలు వినియోగిస్తే.. ఇతర దేశాలు మన ఉత్పత్తులను దిగుమతి చేసుకోవు. రైతులకు లాభసాటిగా ఉండాలని పామాయిల్ పంటను ప్రోత్సహిస్తున్నాం. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మారింది. సంజీవని ప్రాజెక్టు ద్వారా అందరి ఆరోగ్యాన్ని కాపాడుతాం అని చంద్రబాబు అన్నారు. 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' కింద తొలి విడతగా 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7 వేల చొప్పున రూ.3,125 కోట్లు జమయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని మోదీ పాల్గొన్న పీఎం- కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులతో కలిసి ముఖ్యమంత్రి వర్చువల్‌గా వీక్షించారు. లింగంగుంట్లలో ప్రజావేదిక సభ వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ప్రాసెసింగ్ ఎలాంట్లు, వర్మీకంపోస్ట్ తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. జాతీయ నూనెగింజలు, ఆయిల్‌పామ్ మిషన్ ప్రదర్శనలను తిలకించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చన్నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# శాంతి ఒప్పందం వేళ మళ్లీ పీటముడి

**టెహ్రాన్,మన జనప్రగతి జూన్ 20:** అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది.హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హర్మూజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇది తమ ప్రతిస్పందనలో మొదటి అడుగు అని, దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్-అల్ అన్బియా ప్రకటిం చినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది.నౌకలు జలసంధి వైపు రావద్దని.. అలా వస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఎఖీఉఅ) స్పష్టం చేసింది. ఏదైనా ఒప్పందం అమలు దశలోకి వచ్చినప్పుడు మాత్రమే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొంది. ఇదే సమయంలో, మధ్యంతర ఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు స్విట్జర్లాండ్‌కు తమ బృందం వెళ్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా త్వరలోనే స్విస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. సాంకేతిక అంశాలపై రెండు దేశాలు చర్చలు జరిపేందుకు శుక్రవారమే అక్కడకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. అది వాయిదా పడిన విషయం తెలిసిందే.

# అరుదైన వ్యాధిగ్రస్తులకు సర్కార్ అండ

(మొదటి పేజీ తరువాయి)

రిఫరల్ కేంద్రాలు, ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. రేర్ డిసీజెస్ రిజిస్ట్రీ ఏర్పాటు, వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు పాలసీ తయారీపై సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు సత్యకుమార్ తెలిపారు. మంత్రి లోకేశ్ చొరవ తీసుకుని పాలసీ తయారీకి సలహాలు, సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. అతి త్వరలో పాలసీని రూపొందించి అరుదైన వ్యాధిగ్రస్థులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి సత్యకుమార్ ధీమా వ్యక్తం చేశారు.

# ఖాళీ ఖజానా అప్పగించిన జగన్

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. పల్నాడు జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వైకాపా పాలనలో వ్యవసాయ, నీటిపారుదల శాఖలకు తాళాలు వేశారని ఆరోపించారు. రాష్ట్ర రైతులకు మేలు చేసేలా అనేక కార్యక్రమాలు చేపట్టాం. రెండేళ్లుగా భూసార పరీక్షలు చేస్తున్నాం. డ్రిప్ పరికరాలు ఇస్తున్నాం. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలి. సేద్యంలో ఆధునిక పరిజ్ఞానం వినియోగించుకోవాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పిన సూచనలు పాటించాలి. సేంద్రియ సాగు ఉత్పత్తులనే అనేక దేశాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎరువులు, పురుగుమందుల వినియోగం బాగా తగ్గించాలని సూచించారు. పంటలను అంతర్జాతీయ మార్కెట్లో అమ్మాలంటే సేంద్రియ వ్యవసాయం చేయాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలన్నారు.

# పీఎం కిసాన్ డబ్బులు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ది చేకూరింది. కేంద్రప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్దిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్దిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

# ఖతార్ పాలకుల ఔదార్యం

(మొదటి పేజీ తరువాయి)

వేగంగా.. ఎక్కువ దూరం ప్రయాణిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఖతార్ పాలకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జులై 4న జరగనున్న అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకల్లో నిర్వహించే విమానాల ప్రదర్శనల్లో ఈ విమానం కూడా పాల్గొనే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. కాగా.. విమానం లోపల లెదర్ సీట్లు, గోల్డ్ షేడ్స్‌తో కూడిన లేత గోధుమ రంగు గోడలు ఉన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటివరకు 747- 200బి ఎయిర్‌ఫోర్స్ వన్ హోదాలో అమెరికా అధ్యక్షుడికి అధికారిక విమానంగా ఇది వ్యవహరించింది.

జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ నుంచి ట్రంప్ వరకు ప్రతి అధ్యక్షుడికి ఈ పాత విమానమే సేవలందించింది. అధునాతన విమానం కాకపోయినా సౌకర్యవంతంగా ఉండేదని అమెరికా ప్రొటోకాల్ చీఫ్ మోనికా క్రౌలీ తెలిపారు. ప్రస్తుతం దీని ప్రస్థానం ముగిసింది. యూఎస్ వైమానిక దళం ఆర్డర్ చేసిన రెండు కొత్త బోయింగ్-747 విమానాలు అందేవరకు.. ఖతార్ నుంచి గిఫ్ట్‌గా వచ్చిన ఈ విమానాన్నే ట్రంప్ ప్రయాణాలకు వినియోగించనున్నారు.

మనజనప్రగతి
తెలుగు దినపత్రిక
21 - 06 - 2026

## అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి,పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 20:**-కర్నూల్ నగరంలోని 19 వార్డు గణేష్ నగర్ లో ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ (ఐసిడిఎస్) ప్రాజెక్టు కింద నిర్వహించబడుతున్న అంగన్వాడి సెంటర్ (1311094) ను జిల్లా కలెక్టర్ డా. ఎ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, టాక్ రిజిస్టర్ ఎంట్రీలను పరిశీలించారు. అందిస్తున్న ఆహారం, పరిశుభ్రత మరింత మెరుగుపడేలా తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. పిల్లలతో ముచ్చటించి, ప్రశ్నలతో వారి ప్రోగ్రెస్ ను తెలుసుకున్నారు. పిల్లలకు తినుబండారాలు పంచారు. అంగన్వాడి కేంద్రం సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులతో వాట్సాప్ గ్రూప్ ద్వారా సూచనలు, సలహాలు, తరచుగా ఫీడ్బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. నైతిక విలువలు, మంచి ప్రవర్తన అలవడేలా పిల్లలకు బోధించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రంలో మెరుగైన సౌకర్యాలు, శుభ్రమైన శౌచాలయం, స్వచ్ఛమైన తాగునీరు, మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పౌష్టికాహారం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాతా శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని తరచుగా సందర్శించి, తనిఖీలు నిర్వహించాలన్నారు. నిరంతర పర్యవేక్షణ ద్వారా అంగన్వాడీ కేంద్రాలు క్రియాశీలకంగా పనిచేసే బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. విజయ పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్





**పత్తికొండ మన జనప్రగతి జూన్ 20:**-రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ అన్నారు.పత్తికొండ నియో జకవర్గంలోని కృష్ణగిరి మండలం తొగర్చేడు గ్రామంలో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ 202627 తొలి విడత నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా 54,774 మంది రైతుల ఖాతాల్లో తొలి విడతగా రూ.36.84 కోట్ల ఆర్థిక సాయం జమ కావడం రైతుల పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు రైతుల సాగు ఖర్చులను తగ్గించే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రైతు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని, ప్రతి రైతు కుటుంబానికి అండగా నిలిచి వారి ఆర్థిక పురోగతికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పందికోన ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు అగ్నివీర్లుగా ఎంపిక



**పత్తికొండ మన జనప్రగతి జూన్ 20:**-పందికోన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన ఇద్దరు విద్యార్థులు భారత సైన్యంలో అగ్నివీర్లుగా ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా దేశ సేవకు సిద్ధమైన యువ సైనికులను, అలాగే తమ పిల్లలను దేశ రక్షణ కోసం పంపిస్తున్న తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖాదర్ బీ మాట్లాడుతూ దేశ సేవ చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని, సైన్యంలో చేరడం కేవలం ఉద్యోగం కాకుండా దేశానికి చేసే అత్యున్నత సేవ అని పేర్కొన్నారు. సాయి డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ మహేష్, కో-డైరెక్టర్ తలారి విజయ్ కూడా అగ్నివీర్లుగా ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, యువత దేశభక్తితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అగ్నివీర్లుగా ఎంపిక కావడం గ్రామ ప్రజలకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొని ఎంపికైన యువకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# రెవెన్యూ శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలి

### కొత్త తరం ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 20:**-రెవెన్యూ శాఖపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేందుకు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడం ద్వారా శాఖ ప్రతిష్ఠను పెంచవచ్చని తెలిపారు.శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన రెవెన్యూ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం, ఎన్నికల నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణ వంటి బాధ్యతలను రెవెన్యూ శాఖ సమర్థంగా నిర్వహిస్తోందన్నారు.ప్రజా ఫిర్యాదులను ప్రారంభ దశలోనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించి శాఖ ప్రతిష్ఠను కాపాడాలని సూచించారు. కొత్త తరం రెవెన్యూ ఉద్యోగులకు శాఖ విధులు, చట్టాలు, పరిపాలనా విధానాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.అలాగే కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలని, ఉద్యోగులు యోగా, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవాలని సూచిం చారు. ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ అవినీతికి తావులేకుండా నాణ్యమైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ, రెవెన్యూ శాఖ ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో కీలకమైన విభాగమని, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తోందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రెండవ రోజు కొనసాగిన ప్రజానాట్యమండలి శిక్షణా తరగతులు


### మూఢనమ్మకాల నిర్మూలన,సామాజిక చైతన్యమే లక్ష్యమని నేతల పిలుపు





**పత్తికొండ మన జనప్రగతి జూన్ 20:**-ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల జిల్లా స్థాయి శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం పత్తికొండలోని చదువుల రామయ్య భవన్‌లో రెండవ రోజు పాటలు, డప్పుల శిక్షణా తరగతులు ఉత్సాహంగా కొనసాగాయి.ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ, దేశంలో మతోన్మాద శక్తులు మనుధర్మ శాస్త్రం పేరుతో ప్రజలను మూఢత్వంలోకి నెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని, ఇటువంటి పరిస్థితులు సమాజానికి, దేశానికి మంచివి కావని అన్నారు. ప్రజలను మూఢనమ్మకాల నుంచి బయటకు తీసుకురావడంతో పాటు సామాజిక చైతన్యం కల్పించేందుకు ఉద్యమ, సామాజిక పాటలను కళాకారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.అలాగే దేశంలో అవినీతి, లంచగొండితనం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించే పాటలతో పాటు రైతుల సమస్యలను ప్రతిబింబించే ఉద్యమ గీతాలను కూడా శిక్షణలో భాగంగా నేర్పిస్తున్నామని పేర్కొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కళాకారులు, ప్రజలు శిబిరంలో చురుకుగా పాల్గొని కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకువచ్చారని, వారికి కళాభివందనాలు తెలియజేశారు.రాష్ట్ర బాధ్యులు పి. రామచంద్రయ్య మాట్లాడుతూ పాటకు, డప్పుకు ఉన్న అవినాభావ సంబంధాన్ని వివరించారు. జిల్లా స్థాయి శిక్షణ అనంతరం నియోజకవర్గాల వారీగా కూడా శిక్షణా తరగతులు నిర్వహించి, కళాకారులు క్షేత్రస్థాయిలో ప్రజల మధ్యకు వెళ్లి చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు, జిల్లా కార్యదర్శి వి. నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు నబీ రసూల్, రాజాసాహెబ్, పత్తికొండ మండల కార్యదర్శి యు. కారుమంచి, పట్టణ కార్యదర్శి రామానుజులు, జిల్లా సమితి సభ్యులు గురుదాసు, కారన్న, నెట్టకంటయ్య, గిడ్డయ్య గౌడ్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి జోలపురం కాసిం, వర్మ, డప్పు బద్రీ, మాదన్న, సిద్దు, రవి, ఉరుకుంద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నీట్ (యూజీ)-2026 పునఃపరీక్షకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు: కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 20:**-నీట్ (యూజీ)-2026 పునఃపరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లాలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఆదివారం జరగనున్న పరీక్ష నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయం పరేడ్ మైదానంలో బందోబస్తు విధులకు హాజరైన పోలీసు అధికారులు,సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు.జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో 4,995 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానుండగా, ప్రతి కేంద్రం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల రవాణాకు కర్నూలు పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా సహకరించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అభ్యర్థులను భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఫ్రిస్కింగ్ నిర్వహించిన తరువాత మాత్రమే లోపలికి అనుమతించాలని సూచించారు.మొబైల్ ఫోన్లు, ఐప్యాడ్లు, ల్యాప్‌టాప్‌లు, బ్లూటూత్ ఇయర్‌ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్ష నిర్వహణ మొత్తం కేంద్ర స్థాయి పర్యవేక్షణలో కొనసాగుతుందని పేర్కొన్నారు.పరీక్ష పూర్తయ్యే వరకు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్ష సమయం వరకు మూసివేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.విద్యార్థుల సౌకర్యార్థం కర్నూలు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, సీఐలు, ఎస్ఐలు తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతికి జన్మదిన శుభాకాంక్షలు



**దేవనకొండ మన జనప్రగతి జూన్ 20:**-ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు పోలీసు అధికారులు ఆమె నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ వెంకట్రామయ్య, దేవనకొండ సీఐ వేణుగోపాల్, ఆస్పరి సీఐ శ్రీనివాస్ నాయక్, చిప్పగిరి మరియు ఆలూరు ఎస్సైలు వైకుంఠం జ్యోతిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.వారి అభిమానానికి, ఆప్యాయతకు వైకుంఠం జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనజనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతు | అభివృద్ధి మా లక్ష్యం



# రెవెన్యూ సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

## - తహసీల్దార్ విజయ్ కుమార్



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 20:–**రెవెన్యూ వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందని, ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని మండల తహసీల్దార్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. రెవెన్యూ డే సందర్భంగా సిద్ధవటం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వీఆర్ఏలు బోడ వెంకటసుబ్బయ్య, మందారపు వెంకటసుబ్బయ్యలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా రెవెన్యూ సిబ్బంది పనిచేయాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. రెవెన్యూ యంత్రాంగం లేకుండా అనేక ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యం కాదన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

## - మాధవరం పీహెచ్‌సీలో స్వచ్ఛ ఆంధ్రస్వచ్ఛ జీవన్ కార్యక్రమం



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 20:–**పరిసరాలు శుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మన్సూర్ అలీ ఖాన్ తెలిపారు. మండలంలోని మాధవరం–1 గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రస్వచ్ఛ జీవన్ కార్యక్రమంలో భాగంగా పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వైద్యశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ద్వారా రోగులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించవచ్చన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని సూచించారు. భోజనం ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ కళావతి, హెల్త్ సూపర్వైజర్ రమణయ్య, జ్యోతికళ, స్టాఫ్ నర్స్ లీలావతి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పెన్నా నదిలో చెత్త డంపింగ్..

**ప్రమాదంలో ప్రజారోగ్యం**

**మురుగు, చెత్తాచెదారంతో కలుషితమవుతున్న జీవనాడి..**

**చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్**



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 20:–**రైతుల పంట పొలాలకు, ప్రజల తాగునీటి అవసరాలకు ఆధా రమైన పెన్నా నది కాలుష్యానికి గురవుతోంది.మండలంలోని కడపాయపల్లె గ్రామ ఎస్సీ కాలనీ సమీపంలో పెన్నా నదిలోకి మురుగునీరు, చెత్తాచెదారం వేయడంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి.నది ఒడ్డున భారీగా చెత్తను డంపింగ్ చేయడంతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదిలోకి డ్రైనేజీ నీరు, వ్యర్థాలు చేరడం వల్ల నీరు కలుషితమై అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు. పవిత్రమైన పెన్నా నదిని చెత్తతో కలుషితం చేయడం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నదిలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, భవిష్యత్తులో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# రాచమల్లు అవినీతి,అక్రమాల బిగ్‌బాస్: జీవి ప్రవీణ్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 20:–**మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డిపై టిడిపి నాయకుడు, మాజీ ఇన్‌చార్జి జీవి ప్రవీణ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాచమల్లు మూడు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.డీఏడబ్ల్యూ కాలేజీ వ్యవహారంలో అక్రమాలు జరిగాయా లేదా అనే విషయాన్ని స్పష్టం చేయాలని, ఆ కాలేజీలో డబ్బులు తీసుకుని రాజకీయ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అలాగే గృహ నిర్మాణ స్థలాలకు సంబంధించిన ఇనుప కడ్డీలు మాయమయ్యాయని చెప్పి, అవే డీఏడబ్ల్యూ కాలేజీకి వెళ్లాయని ఆరోపించడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు.తన ఓటమికి కారణం తానేనని రాచమల్లు చెప్పడం హాస్యాస్పదమని, ప్రజలకు సమాధానం చెప్పగలిగిన వారే నిజమైన నాయకులని అన్నారు. రాచమల్లు మానసికంగా అస్థిరంగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు ఉన్నా నిరూపించాలని, తెలియక ఏదైనా తప్పు జరిగి ఉంటే క్షమాపణ చెప్పే సంస్కారం తనకు ఉందన్నారు. అయితే రాచమల్లు మాత్రం రాజకీయ పదవులను అడ్డం పెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన నాయకులు వ్యక్తిగత విమర్శలకు పరిమితం కాకుండా అభివృద్ధి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. స్టీల్ ప్లాంట్‌లో రాయలసీమ యువతకు, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రిని కలిసి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. పాలకేంద్రం పునఃప్రారంభం, ప్రాంతీయ అభివృద్ధి వంటి అంశాలపై కూడా చర్చించినట్లు చెప్పారు.ప్రొద్దుటూరు అభివృద్ధి కోసం ఎవరితోనైనా కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్న ప్రవీణ్ కుమార్ రెడ్డి, రాచమల్లు అవినీతి, అక్రమాల “బిగ్‌బాస్“గా మారారని ఆరోపించారు.

# కువైట్‌లో నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

## - పేద టీడీపీ కార్యకర్తకు రూ.30 వేల ఆర్థిక సాయం



**కువైట్ మన జనప్రగతి జూన్ 20:–**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, స్వర్గీయ ఎన్టీఆర్ కుమార్తె, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మాతృమూర్తి నారా భువనేశ్వరి జన్మదినాన్ని పురస్కరించుకుని కువైట్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కష్టకాలంలో ఉన్న టీడీపీ కార్యకర్తకు సుగవాసి యువసేన, ఏపీ టీడీపీ యూత్ కువైట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, సామాజిక సేవా రంగాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న విషయం తెలిసిందే. ఆమె సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని కువైట్‌లోని హవల్లీ ప్రాంతంలో ఉన్న ప్రవాస తెలుగు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.ఇటీవల కువైట్‌లో ఉద్యోగం నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ చేతికి తీవ్ర గాయమై, ఉద్యోగానికి దూరమై ఇంటికే పరిమితమైన టీడీపీ కార్యకర్త సుధాకర్ ఆచారి ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న సుగవాసి యువసేన, ఏపీ టీడీపీ కువైట్ నాయకులు ఆయనకు అండగా నిలవాలని నిర్ణయించారు.సుగవాసి యువసేన అధ్యక్షుడు, ఎన్ఆర్ఐ టీడీపీ నాయకుడు కంచన రెడ్డిశేఖర్, ఏపీ టీడీపీ కువైట్ అధ్యక్షుడు, ఎన్ఆర్ఐ టీడీపీ నాయకుడు పఠాన్ ఖాదర్ ఖాన్ నాయకత్వంలో, సుగవాసి సాయి కిరణ్, పద్మరాజు వేణురాజు, మనుబోతు సహదేవ్, ఆవుల నాగేంద్ర, పగడాల సుగుణ, కొండా మర్రి శ్రీహరి నాయుడు (పాలాయెకిరి టీడీపీ కువైట్ అధ్యక్షుడు) తదితరుల ఆర్థిక సహకారంతో మొత్తం 91 కువైట్ దినార్లు (సుమారు ₹30,000) సేకరించి సుధాకర్ ఆచారికి అందజేశారు.పెద్దలు ఖదురున్ సమక్షంలో జిలాన్ భాషా, అనీఫ్, చంద్రన్నతో పాటు గ్రూప్ సభ్యులు సుధాకర్ ఆచారి నివాసానికి వెళ్లి ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకుని తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నారా భువనేశ్వరి చేపడుతున్న సేవా కార్యక్రమాలు తమకు స్ఫూర్తినిచ్చాయని, భవిష్యత్తులో కూడా అవసరంలో ఉన్న తెలుగు ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.ప్రవాసాంధ్రులు విదేశాల్లో ఉన్నప్పటికీ స్వదేశంతో అనుబంధాన్ని కొనసాగిస్తూ, అవసరమైన సమయంలో తోటి తెలుగు వారిని ఆదుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. నారా భువనేశ్వరి జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం ఆమె సేవా భావానికి నిజమైన నివాళిగా నిలిచిందని వారు అభిప్రాయపడ్డారు.

# పశుగ్రాస గడ్డి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

## • 75 శాతం సబ్సిడీతో జొన్న, మొక్కజొన్న విత్తనాల పంపిణీ: మండల పశు వైద్యాధికారి భాస్కర్




**వీరబల్లి మన జనప్రగతి జూన్ 20:–**రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తున్న పశు గ్రాస గడ్డి విత్తనాలను సద్వినియోగం చేసుకుని పశువులకు మేత కొరత లేకుండా చూసుకోవాలని మండల పశు వైద్యాధికారి టీ. భాస్కర్ సూచించారు. శనివారం మండలంలోని మాట్లి పంచాయతీ రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై అందజేస్తున్న జొన్న, మొక్కజొన్న విత్తనాలను స్థానిక సర్పంచ్ సోమరాపు నాగార్జునాచారి, మండల టీడీపీ అధ్యక్షుడు బాణుగోపాల్ రాజు, మండల బీజేపీ అధ్యక్షుడు నరేంద్రలతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ మండలంలోని పాడి రైతులకు పశుగ్రాస కొరత తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మండలానికి 1,900 కిలోల జొన్న విత్తనాలు, 1,650 కిలోల మొక్కజొన్న విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు.ఈ విత్తనాలు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, అర్హులైన పాడి రైతులు వాటిని పొందుతూ పశుగ్రాస సాగును విస్తరించాలని కోరారు.పశుగ్రాస సాగు ద్వారా పశువులకు ఏడాది పొడవునా నాణ్యమైన మేత అందుబాటులో ఉండటంతో పాటు పాల ఉత్పత్తి కూడా పెరుగుతుందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అందరికీ అందుబాటులోకి అన్నారెడ్డి చెస్ట్ కేర్ హాస్పిటల్

## • ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి



**కడప మన జనప్రగతి జూన్ 20:–**కడప నగరంలోని ద్వారకానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అన్నారెడ్డి చెస్ట్ కేర్ హాస్పిటల్‌ను ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి మరియు టీడీపీ జోనల్ కో–ఆర్డినేటర్ ఆర్. శ్రీనివాసరెడ్డి శనివారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఛాతీ సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్స కోసం అత్యాధునిక సదుపాయాలతో ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా ఈ ఆసుపత్రి కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఆసుపత్రి నిర్వాహకులు మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు, నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, వైద్యాధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రెండు స్కూటర్లు ఢీకొని ముగ్గురికి గాయాలు

## • బాలసానివాండ్లపల్లె సమీపంలో రోడ్డు ప్రమాదం

## • ఒకరికి కాలు విరగడంతో ఆసుపత్రికి తరలింపు



**వీరబల్లి మన జనప్రగతి జూన్ 20:–**వీరబల్లి మండలంలోని బాలసానివాండ్లపల్లె సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు రామపురం నుంచి సానిపాయ వైపు స్కూటర్‌పై వెళ్తున్న పాపయ్య (35), శివమ్మ (30) దంపతులు ఎదురుగా కొత్తరోడు వైపు నుంచి వస్తున్న బాలాజీ (25) స్కూటర్‌ను ఢీకొన్నారు.ఈ ప్రమాదంలో ముగ్గురికీ గాయాలు కాగా, శివమ్మకు కాలు విరిగినట్లు తెలిసింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వీరబల్లి ఎస్సై సుస్మిత సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం గాయపడిన వారిని 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించేలా చర్యలు చేపట్టారు.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# పశు కేంద్రీకృత విధానంతో రైతులకు గణనీయమైన ఆదాయం:ఎమ్మెల్యే




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి జూన్ 20:–**ప్రొద్దుటూరు మండల పరిధిలోని కామనూరు పశువైద్య ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన “అనిమల్ సెంట్రిక్ బ్రీడింగ్ అప్రోచ్“ రైతుల అవగాహన సదస్సులో ప్రొద్దుటూరు ఎమ్మెల్యేనంద్యాల వరదరాజుల రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశు కేంద్రీకృత విధానం ద్వారా రైతులకు గణనీయమైన ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. పాడి పశువులు ఈనిన తర్వాత సకాలంలో ఎదకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పశువు ఏడాదికి ఒక దూడను ఉత్పత్తి చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న లింగ నిర్ధారణ వీర్యాన్ని వినియోగించుకోవడం ద్వారా అధిక సంఖ్యలో ఆడ దూడలను పొందవచ్చని రైతులకు వివరించారు. దీంతో పాల ఉత్పత్తి పెరగడంతో పాటు దూడల ఉత్పత్తి కూడా అధికమై రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎన్.ఏ. శ్రీనివాసులు, జమ్మలమడుగు ఉపసంచాలకులు డాక్టర్ వీరబ్రహ్మం, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వహణ అధికారి డాక్టర్ సి.హెచ్. రాజ తిమ్మారెడ్డి, ప్రొద్దుటూరు ఏరియా పశువైద్యాధికారి డాక్టర్ ఆర్. ధనుంజయ రెడ్డి, ఎర్రగుంట్ల సహాయ సంచాలకులు డాక్టర్ బి. మునయ్య, డీఎల్‌పీయూ సహాయ సంచాలకులు డాక్టర్ మోహన్‌రావు, పశు వైద్యాధికారులు డాక్టర్ టి. మాధవ ఓబుల్ రెడ్డి, డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ పనీంద్ర రెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి, పశువైద్య సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# చింతలమడుగుపల్లెలో తొలిపూజతో ప్రారంభమైన పీర్ల పండుగ

**వేంపల్లె మన జనప్రగతి జూన్ 20:** వేంపల్లె మండల పరిధిలోని చింతలమడుగు పల్లె గ్రామంలో పీర్ల పండుగ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు,గ్రామస్తులు తెలిపారు.ఇందులో భాగంగా 19వ తేది నుండి 25వ తేది వరకు జరుగనున్నట్లు తెలిపారు.19వ తేది శుక్రవారం స్వామివారి తొలిపూజ నిర్వహించారు. 23వతేది చిన్న సరిగెత్తు, 24వతేది విడిదినం,25వతేది పెద్ద సరిగెత్తు పూజలు నిర్వహించనున్నారు.25వ తేది అర్ధరాత్రి భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసేదరని తెలిపారు.తెల్లవారుజామున 3గంటలకు మంగళ వాయిద్యాలు,కనక తప్పెట్లు, బాణసంచాల నడుమ స్వామివారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆర్కెస్ట్రా నిర్వహించానున్నారు.



మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
21 - 06 - 2026

# త్రాగునీటి ట్యాంక్ వద్ద అపరిశుభ్రత..ప్రజలకు ఇబ్బందులు

- జంగాలపల్లె ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్య..
- రెండు రోజుల్లో పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి హామీ





**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 20:-** మండలంలోని జంగాలపల్లె గ్రామ ఎస్సీ కాలనీలో అపరిశుభ్రత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రజలు తాగే మంచినీటి ట్యాంక్ చుట్టూ పాచి పేరుకుపోయి, డ్రైనేజీ కాలువలు స్తంభించడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్రాగునీటి ట్యాంక్ పరిసరాలు శుభ్రం చేయకపోవడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, రాత్రి వేళల్లో దోమల బెడద ఎక్కువై ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు తెలిపారు. విష జ్వరాలు వ్యాపించకుండా వెంటనే డ్రైనేజీ కాలువలను శుభ్రం చేసి, త్రాగునీటి ట్యాంక్‌ను శుభ్రపరిచి బ్లీచింగ్, అబేట్ పిచికారీ చేయాలని అధికారులను కోరారు. ఈ విషయమై జంగాలపల్లె పంచాయతీ కార్యదర్శి పుల్లయ్యను వివరణ కోరగా.. ఎస్సీ కాలనీలో త్రాగునీటి ట్యాంక్‌ను శుభ్రపరిచి, డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని, రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పునరావాసం లేకుండా కుటుంబాలను ఖాళీ చేయించడం అమానుషం

### - మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్ కుమార్



**కాకినాడ మన జనప్రగతి జూన్ 20:-** అభివృద్ధి పేరుతో పేద కుటుంబాల జీవనోపాధిని దెబ్బతీయడం ఏ ప్రభుత్వానికీ తగదని, వార్ఫ్ రోడ్ ఏటిగట్టు ప్రాంతంలో దశాబ్దాలుగా నివసిస్తూ జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఖాళీ చేయించే ప్రయత్నాలు ఆందోళన కలిగిస్తున్నాయని 30వ డివిజన్ మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు రాగిరెడ్డి అరుణ్ కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి ఎవరూ వ్యతిరేకం కాదని, అయితే ఆ అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా ఉండాలని పేర్కొన్నారు. కొంతమంది పేదల కన్నీళ్లపై నిర్మించే అభివృద్ధి నిజమైన అభివృద్ధి కాదన్నారు. వార్ఫ్ రోడ్ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా గేదెలు, ఆవులు పెంచుకుంటూ, టీ దుకాణాలు, పాత సామాన్ల వ్యాపారాలు, ఇతర చిన్నచిన్న వృత్తులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి అనువైన స్థాయికి తీసుకొచ్చింది అక్కడి ప్రజలేనని, తమ శ్రమతో జీవనోపాధిని ఏర్పరచుకున్న వారిని ఒక్కసారిగా ఖాళీ చేయమంటే వారి భవిష్యత్తు ఏమవుతుందని ప్రశ్నించారు. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూములు అవసరమైతే ముందుగా బాధిత కుటుంబాలకు సముచిత పునరావాసం కల్పించడంతో పాటు ప్రత్యామ్నాయ వ్యాపార స్థలాలు లేదా అభివృద్ధి చేస్తున్న ప్రాజెక్టులోనే షాపులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పేదల జీవనాధారాలను కోల్పోయేలా చేసి పార్కులు, ఫుడ్ కోర్టులు నిర్మించడం సామాజిక న్యాయం కాదన్నారు. అభివృద్ధి అంటే కేవలం నిర్మాణాలు చేపట్టడం మాత్రమే కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను కాపాడటం కూడా అని తెలిపారు. పునరావాసం లేకుండా తరతరాలుగా అక్కడ నివసిస్తున్న కుటుంబాలను బలవంతంగా తొలగిస్తే వారి జీవితాలు చీకటిమయం అవుతాయని హెచ్చరించారు. ప్రభుత్వం ఈ అంశాన్ని పునఃసమీక్షించి బాధిత కుటుంబాలతో చర్చలు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలని కోరారు. ప్రజలను వెలివేయడం కాదు, వారి జీవితాలకు భరోసా కల్పించడమే నిజమైన అభివృద్ధి అని రాగిరెడ్డి అరుణ్ కుమార్ పేర్కొన్నారు.

# జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపిక



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 20:-** జాతీయస్థాయి జూనియర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇక్కడ ఇంజనీరింగ్ ఈసీఈ చివరి సంవత్సరం చదువుతున్న జ్యోతి, ద్వితీయ సంవత్సరం సిఎస్సి చదువుతున్న సువర్ణ, పీ2 చదువుతున్న రాఘవేంద్రలు రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే మాస్టర్స్ విభాగంలో ట్రిపుల్ ఐటీ ఫిజిక్స్ అధ్యాపకుడు బాల గోవింద్ తివారి కూడా ఈ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు వీరు ఈనెల 23 నుంచి 28 వరకు హైదరాబాదులో జరగనున్న జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొననున్నారు. మీరు ఎంపిక పట్ల ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య గడ్డం విజయ ప్రకాష్,అకడమిక్ డీన్ రమేష్ దండుకర్ హర్షం వ్యక్తం చేశారు.

# పుచ్చకాయలమాడ రైతు సేవా కేంద్రంలో ఎరువులు అందుబాటులో

## రైతులు పాస్‌బుక్, ఆధార్‌తో వచ్చి నమోదు చేసుకోవాలి



**పత్తికొండ మన జనప్రగతి జూన్ 20:-** పత్తికొండ మండలంలోని పుచ్చకాయలమాడ రైతు సేవా కేంద్రానికి రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు అందుబాటులోకి వచ్చినట్లు రైతు సేవా కేంద్రం అధికారి శివ తెలిపారు. సేవా కేంద్రానికి 9 మెట్రిక్ టన్నుల యూరియా, 13 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులు చేరుకున్నాయని ఆయన వెల్లడించారు. అలాగే వివిధ రకాల కెమికల్ మందులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎరువులు అవసరమైన రైతులు తమ పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్‌తో రైతు సేవా కేంద్రానికి వచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. పంట విస్తీర్ణం, అవసరాన్ని బట్టి రైతులకు ఎరువులు, పురుగుమందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కావున గ్రామ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన ఎరువులు, మందులు పొందాలని ఆయన కోరారు.

# జర్నలిస్ట్ వాసుకు ' కాకినాడ ప్రెస్ క్లబ్' చేయూత



**కాకినాడ మన జనప్రగతి జూన్ 20:-** కాకినాడ ప్రెస్ క్లబ్(రిజిస్టర్డ్ నెంబర్ 383/2021) సభ్యులు ఎవరైనా అనారోగ్యంగా ఉంటే వారికి తక్షణం సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని క్లబ్ ఏకగ్రీవంగా తీర్మానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో క్లబ్ సభ్యులు, ఉదయం ధ్వని స్టాఫ్ రిపోర్టర్ వాసు ఇటీవల జరిగిన ప్రమాదంకు గురై కాకినాడ లక్ష్మీ హాస్పిటల్లో చేతికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. కాకినాడ బర్మా కాలనీలో ఆయన నివాసం వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జర్నలిస్ట్ వాసును క్లబ్ ప్రతినిధులు కలిసి ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. తమ వంతు సాయంగా 25 కేజీల బియ్యం బస్తాతో పాటుగా నిత్యవసర వస్తువులు, పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అన్ని విధాల ఆదుకుంటుందని వాసుకు క్లబ్ అధ్యక్షులు పిఎ అచ్యుత రామారావు, కార్యదర్శి జి శోభన బాబు, కోశాధికారి కోనేటి శ్రీనివాసరావు, క్లబ్ ప్రతినిధులు సంయుక్తంగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ కాకినాడ ప్రెస్ క్లబ్ అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో ఎన్నికలు నిర్వహించిన అనంతరం క్లబ్ను మరింత పటిష్టం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రమాదం జరిగినా, లేకపోతే అనారోగ్యంగా ఉన్న నేపథ్యం క్లబ్లో ప్రతీ సభ్యునికి వెంటనే రైస్, నిత్యవసర సరుకులు అంద చేయాలని క్లబ్ అధ్యక్షులు అచ్యుత రామారావు తెలిపారు. ప్రమాదం జరిగిన విధానాన్ని జర్నలిస్టు వాసు క్లబ్ ప్రతినిధులకు వివరించారు. అనారోగ్యంగా ఉన్న తనను క్లబ్ ప్రతినిధులు, సభ్యులు వచ్చి ఆప్యాయంగా పలకరించడంతో పాటుగా రైస్, నిత్యవసర సరుకులు, పండ్లు అందజేయడం చాలా సంతోషంగా ఉందని జర్నలిస్ట్ వాసు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కె రాజు,జీ.బి స్వామి,అజయ్,శాస్త్రి,మనోహర్ రాజు,తిరుమలేశ్,సూర్యనారాయణ,నారాయణ,శివ,భాష,బషీర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయం వద్ద మృతదేహంతో సీఐటీయూ నిరసన

### - అవుట్సోర్సింగ్ కార్మికుడికి న్యాయం చేయాలని డిమాండ్




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 20:-** ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట అవుట్సోర్సింగ్ కార్మికుడు బి. వెంకటేశ్వర్లుకు న్యాయం చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయన తండ్రి మృతదేహంతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం, కాలయాపన కారణంగా బాధిత కుటుంబం తీవ్ర మానసిక వేదనకు గురైందని ఆరోపించారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న బి. వెంకటేశ్వర్లును ఐదు నెలల క్రితం విధుల నుంచి తొలగించారని, దీనిపై న్యాయం కోసం కార్మిక సంఘాలు ఆరు రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష నిర్వహించాయని తెలిపారు. అప్పట్లో ఉన్నతాధికారుల హామీ మేరకు వారం రోజుల్లో విధుల్లోకి తీసుకుంటామని చెప్పి దీక్షను విరమింపజేసినా, మూడు నెలలు గడిచినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఎంక్వయిరీ నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపడంలో అధికారులు ఆలస్యం చేశారని, గత నెలలో నివేదిక సమర్పించినప్పటికీ ఇప్పటికీ నిర్ణయం వెలువడలేదన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి బాధితుడిని విధుల్లోకి తీసుకోవాలని లేఖ ఇచ్చినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఉద్యోగం కోల్పోవడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని, క్యాన్సర్‌తో బాధపడుతున్న వెంకటేశ్వర్లు తండ్రికి ఈఎస్ఐ చికిత్స కూడా నిలిచిపోయిందన్నారు. కుటుంబ పరిస్థితులు మరింత దిగజారడంతో మానసిక వేదనకు గురైన ఆయన తండ్రి మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి మృతదేహాన్ని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉంచి అధికారుల వైఖరికి నిరసన తెలిపామని, అయినప్పటికీ ఉన్నతాధికారులు స్పందించలేదని సీఐటీయూ నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ జీవి ప్రవీణ్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. దహన సంస్కారాలు పూర్తైన అనంతరం తనను కలవాలని, జిల్లా కలెక్టర్ మరియు ఇన్‌చార్జ్ మంత్రితో మాట్లాడి న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. బాధితుడికి వెంటనే న్యాయం చేయకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ శాశ్వత, అవుట్సోర్సింగ్ కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విజయ్ కుమార్, గంగాధర్ రెడ్డి, శివతో పాటు పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



**కాకినాడ మన జనప్రగతి జూన్ 20:-** వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. శుక్రవారం అర్బన్ మండల రెవెన్యూ అధికారి కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో "అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్" రెండో విడత నిధుల చెక్కులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన "అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్" పథకం కింద రెండో విడత నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ నుంచి "పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్" కార్యక్రమంలో పాల్గొనగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లా చిలకలూరిపేట నుంచి రాష్ట్ర రైతులకు నిధులను విడుదల చేశారని తెలిపారు. రెండో విడత కింద ప్రతి రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 5,000, కేంద్ర ప్రభుత్వం తరపున రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 7,000 నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు రాష్ట్ర వాటా రూ. 2,342.92 కోట్లు, కేంద్ర వాటా రూ. 782.55 కోట్లు కలిపి మొత్తం రూ. 3,125.47 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. కాకినాడ నియోజకవర్గ పరిధిలో 111 మంది లబ్ధిదారులకు అన్నదాత సుఖీభవ, 131 మంది లబ్ధిదారులకు పీఎం కిసాన్ నిధులు అందగా, మొత్తం సుమారు రూ. 8 లక్షలు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, పంతాడి రాజు, టీపీఆర్వో శైలజ, సీఎంఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మనహాల్‌లో ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు

### - ప్రజలకు మెరుగైన సేవలందించడమే ధ్యేయం: తహసీల్దార్,మునివేలు



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూన్ 20:-** బొమ్మనహాల్ మండల తహసీల్దార్ మునివేలు ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలను నిర్వహించుకున్నరు, ఈ సందర్భంగా తహశీల్దార్ మునివేలు మాట్లాడుతూ.. ప్రజలకు రెవెన్యూ శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమన్నారు, మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో శాఖ పోషిస్తున్న కీలక పాత్ర గురించి అధికారులు వివరించారు. అందుకు ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, పారదర్శకంగా సేవలు అందించడం రెవెన్యూ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు, అదేవిదంగా ప్రభుత్వ కార్యక్రమాల అమలులో రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు చేరువ కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో విజయభాస్కర్, మండల విద్యాశాఖాధికారి మల్లికార్జున, డిప్యూటీ తహసీల్దార్ రఘు, ఆర్ఐ బాలకృష్ణ, వైద్యాధికారి డా. చల్లా శ్రీలక్ష్మి, మరియు వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం విజయవంతం



**కూకట్ పల్లి మన జనప్రగతి జూన్ 20:** మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాధారణ సభ్యుల సమావేశం "జనరల్ బాడీ మీటింగ్" విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మద్దతు, సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన కాలనీ సభ్యులందరికీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న సభ్యులందరూ ఏకగ్రీవంగా మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ ఎన్నికలను నిర్వహించేందుకు ఆమోదం తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని సభ్యులు సూచించారు. ఎన్నికల తేదీ, ఎన్నికల ప్రక్రియ, నామినేషన్లు మరియు ఇతర పూర్తి వివరాలను తదుపరి 24 గంటలలో ప్రకటిస్తామని మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం వెల్లడించింది. కాలనీ అభివృద్ధి కోసం సభ్యులందరూ ఇదే విధంగా సహకరించాలని కార్యవర్గ సభ్యులు కోరారు.

# రాయచోటిలో టీడీపీ విజయోత్సవ ర్యాలీకి జన ప్రభంజనం

### - మంత్రి రాంప్రసాద్ రెడ్డి పనితీరుకు ప్రజల స్పందనే నిదర్శనం: కొమరా వెంకట నరసయ్య



**ఒంటిమిట్ట మన జనప్రగతి జూన్ 20:-** తెలుగుదేశం పార్టీ రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాయచోటి పట్టణంలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీకి భారీ స్పందన లభించిందని రాష్ట్ర మాజీ కల్లుగీత కార్మికుల సంఘం డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య తెలిపారు. పట్టణ పురవీధులు టీడీపీ నినాదాలతో మార్మోగాయని పేర్కొన్నారు. అట్టడుగు స్థాయి ప్రజలకు సైతం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిపై ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో గతంలో పరిష్కారం కాని అనేక సమస్యలను రెండేళ్లలో పరిష్కరించడం వల్లే ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులతో మంత్రి చిత్తశుద్ధిపై ప్రజలకు విశ్వాసం ఏర్పడిందన్నారు. శనివారం జరిగిన విజయోత్సవ ర్యాలీ ఉమ్మడి కడప జిల్లాలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని కొమరా వెంకట నరసయ్య పేర్కొన్నారు.



మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతం | అభివృద్ధి మా లక్ష్యం
21 - 06 - 2026

## శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు



**శేరిలింగంపల్లి మన జనప్రగతి జూన్ 20:**
శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కర్ణాటక గాత్ర కచేరి మరియు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. టెక్సాస్, యుఎస్ నుండి విచ్చేసిన కుమారి శిరీష కోటంరాజు గాత్ర కచేరి అందరిని అలరించింది. అన్నయ్య సంకీర్తనలు, త్యాగరాజ కృతులు , రామదాసు కీర్తనలు ఆలపించి మెప్పించారు. అమ్రితా సింగ్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మూషిక వాహన, బ్రహ్మాంజలి, వసంత స్వరజతి, బృందావన నిలయ, ధనశ్రీ తిల్లాన, వచ్చెను అలిమేలు మంగ, అంబాష్టకం, కొలువైతివారంగా సాయి, కుంతలారావాళీ తిల్లాన అంశాలను ప్రదర్శించి కళాకారులూ సాహితి, మోహన, సాత్విక, పర్ణిక, సింధు, రవిక, అమూల్య, షనాయా, గగన మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్‌లో ఫాదర్స్ డే మరియు యోగా వేడుకలు



**శేరిలింగంపల్లి మన జన ప్రగతి జూన్ 20:-**శ్రీరామ్ న గర్ బి ,బ్లాక్ శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు విద్యార్థిని విద్యార్థులకు యోగాసనాలు చేయించి యోగ చేయడం వలన కలిగే లాభాలను వివరించి తెలిపారు. సూర్య నమస్కారాల వలనఎలాంటి జబ్బులు రాకుండా మనిషి దృఢంగా తయారవుతారని ప్రిన్సిపాల్ సుధా అన్నారు.ఫాదర్స్ డే సందర్భంగాఫాదర్స్ డే కేవలం ఒక వేడుక మాత్రం కాదు. తండ్రులకు, తండ్రి లాంటి వ్యక్తులకు గౌరవాన్ని కృతజ్ఞతను తెలియజేయడానికి ఈ ఒక్క అవకాశం. తండ్రులు తమ పిల్లలకు ఆర్థిక భద్రతను అందించడమే కాకుండా వారికి ముఖ్యమైన విలువలు, క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం సవాలను. ఎదురుకునే సామర్థ్యాన్ని కూడా నేర్పిస్తారు. వారి సేవలను గుర్తు చేసుకొని కృతజ్ఞతలు తెలియజేయడానికి ఒక అద్భుతమైన అవకాశం గా మనం భావించి తల్లిదండ్రులను దైవ సమానులుగా ప్రతి విషయంలో తోడు ఉండాలని ప్రిన్సిపాల్ సుధా స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు .

## బండూరులో డయేరియా అతిసార నివారణపై ప్రజలకు అవగాహన

**- వ్యక్తిగత పరిశుభ్రతతో డయేరియాకు చెక్.**



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూన్ 20:-**మండల పరిధిలో బండూరు గ్రామంలో డయేరియా (అతిసార) వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామ ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్ మాట్లాడుతూ.ముఖ్యంగా 6 నెలల నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భోజనం చేసే ముందు,మలమూత్ర విసర్జన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు.అలాగే ఓఆర్ఎస్ ద్రావణం,జింక్ మాత్రల ప్రాముఖ్యతను వివరించారు, తాగునీటిని తప్పనిసరిగా మరిగించి చల్లార్చి తాగాలని, వండిన ఆహారంపై ఈగలు వాలకుండా మూతలు పెట్టుకోవాలని తెలిపారు,ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన్,రమాదేవి,అంగన్‌వాడీ కార్యకర్త వనజాక్షి,ఆశ కార్యకర్త శ్రావణి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మిట్టమానిపల్లిలో శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం ప్రారంభం

**● అభిషేకాలు,కలశ పూజలు,హోమాలతో వైభవంగా వేడుకలు**



**మైదుకూరు మన జనప్రగతి జూన్ 20:-**మైదుకూరు మండలం మిట్టమానిపల్లి గ్రామంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయానికి నూతనంగా నిర్మించిన ముఖద్వారం (ఆర్చి) మరియు కాంపౌండ్ వాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది.కీర్తిశేషులు కొండిబోయిన ఓబులేసు యాదవ్ స్మారకార్థం ఆయన కుమారుడు కొండిబోయిన రవికుమార్ యాదవ్, ధర్మపత్ని స్రవంతి యాదవ్ కుటుంబ సభ్యుల సహకారంతో ఈ నిర్మాణాలు చేపట్టారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో ముఖద్వారం వద్ద ప్రత్యేక హోమాలు నిర్వహించగా, రవికుమార్ యాదవ్ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొని పూజా కార్యక్రమాలను భక్తిపూర్వకంగా నిర్వహించారు.ముఖద్వారంపై ప్రతిష్ఠించిన శ్రీ ఉమామహేశ్వర స్వామి, శ్రీ వినాయకుడు, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలకు కలశాభిషేకాలు నిర్వహించి, అనంతరం కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఆలయంలో మూలవిరాట్ శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, పూల అలంకరణలు చేపట్టగా, శ్రీ ఉమాదేవి, శ్రీ వినాయకుడు, శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నవగ్రహ కలశ పూజలను వేద మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, బంధుమిత్రులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు రవికుమార్ యాదవ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేయడం ఆనందంగా ఉంది: లయన్ శివారెడ్డి



**రామాపురం మన జనప్రగతి జూన్ 20:-**విద్యార్థులు ఆనందంగా విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యుడు లయన్ శివారెడ్డి ఆకాంక్షించారు. రామాపురం మండలం హసనాపురం గ్రామ పరిధిలోని వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు చెంగల్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు, పలకలు తదితర విద్యా సామగ్రిని అందజేశారు.అనంతరం లయన్ శివారెడ్డి మాట్లాడుతూ తాను కూడా ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేశానని గుర్తు చేసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలను భవిష్యత్తులో కూడా అందించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ తరఫున సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చెంగల్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పులివెందులలో ఘనంగా 'యోగాంధ్ర - 2026' కార్యక్రమం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 20:-** పులివెందుల పట్టణంలోని పూలంగిల్ల సమీప వద్ద శనివారం ఉదయం 'యోగాంధ్ర - 2026' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహవరితంగా నిర్వహించారు. మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ యోగా గురువు వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మనిషి మనుగడకు,ఆరోగ్యకరమైన జీవన శైలికి యోగా ఎంతో అవసరమని పేర్కొన్నారు. యోగా యొక్క విశిష్టతను వివరిస్తూ,నిత్య జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత,శారీరక దృఢత్వం లభిస్తుందని ఆయన తెలిపారు.అనంతరం యోగా గురువు వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమానికి హాజరైన యోగా సాధకులు, మున్సిపల్ సిబ్బంది కలిసి పలు యోగాసనాలు, ప్రాణాయామం సాధన చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది మరియు పట్టణ పరిసర ప్రాంతాల యోగా సాధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాల మాజీ చైర్మన్ చేత ఉచిత విద్యాసామగ్రి పంపిణీ



**రామాపురం మన జనప్రగతి జూన్ 20:-**మండలంలోని అసరాపురం గ్రామం చీకటివాండ్లపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉచిత విద్యాసామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల మాజీ చైర్మన్ రెడ్డమ్మఅర్జున దంపతులు దాదాపు రూ.10 వేల విలువైన నోటు పుస్తకాలు, పెన్నులు, పాఠ్యపుస్తకాలు మరియు ఇతర విద్యా సామగ్రిని విద్యార్థుల అభ్యసనానికి ఉపయోగపడేలా పాఠశాలకు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిచ్చిరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటునందించిన దాతలను అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు రెడ్డమ్మఅర్జున దంపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## ఆవోపా ఆధ్వర్యంలో ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల పంపిణీ

**● ఆర్యవైశ్య విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి**



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 20:**వేంపల్లె లోని ఆర్యవైశ్య అఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరంలో 10వ తరగతిలో మెరిట్ మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. అవోపా అధ్యక్షులు బైరిశెట్టి వెంకట సునీల్ కుమార్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరంలో 10వ తరగతిలో మెరిట్ మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు వేంపల్లెకు చెందిన శ్రీ మారుతి ఏజెన్సీస్ అధినేత పోలేపల్లె రామాంజనేయులు ( పి వి ఎస్ అంజి) సౌజన్యంతో వేంపల్లె శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మొదటి ముగ్గురు మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను పోలేపల్లె రామాంజనేయులు అందజేశారు.ఇందులో భాగంగా ప్రథమ బహుమతి పబ్బతి సరయుకు రూ.5,000/-లు,ద్వితీయ బహుమతి సగలా ప్రణవ్ కు రూ.3,000/-లు,తృతీయ బహుమతి మేడా భావేష్ కు రూ.2,000/-లు నగదు ప్రోత్సాహక అందజేశామన్నారు.మిగతా విద్యార్థులకు బి జి ఎస్ బ్రదర్స్ బాలగంగాధర్, సునీల్ కుమార్ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. అనంతరం దాత అంజి ని అవోపా కార్యవర్గ సభ్యులు శాలువతో ఘనంగా సన్మానించి బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా అవోపా కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తోటంశెట్టి చంద్రశేఖర్,ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు రాయవరం సుబ్బు, ఆవోపా సభ్యుడు వడ్లకుంట సతీష్ కుమార్, ఆవోపా సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## పులివెందులలో ఘనంగా 'స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర' కార్యక్రమం




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 20:-**మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక పట్టణంలో 'స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర - 2026' కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించబడింది.ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ ఆధ్వర్యంలో స్థానిక రంగనాథ స్వామి గుడి ఆవరణాన్ని శుభ్రం చేశారు.అనంతరం కార్యక్రమానికి హాజరైన వారందరితో 'స్వచ్ఛ పులివెందుల' ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పులివెందుల పట్టణాన్ని స్వచ్ఛంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ భాషా, టి.డి.పి.నాయకులు బ్రాహ్మణపల్లి వెంకట్రామి రెడ్డి, నల్లగారి భాస్కర్ రెడ్డి హాజరయ్యారు.కార్యక్రమంలో పురపాలక,సచివాలయ మరియు మెప్మా సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పరిసరాలను శుభ్రపరిచారు.

## యోగా ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగం కావాలి

**● అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూన్ 20:**యోగా ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగం కావాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగానే బలమైన పునాదిగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఆధునిక జీవన విధానంలో పెరుగుతున్న ఒత్తిడులు, అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనమని ఆయన పేర్కొన్నారు. ప్రతిరోజూ కనీసం అరగంట నుంచి 45 నిమిషాల పాటు యోగా ఆసనాలు, ప్రాణాయామం వంటి శ్వాస వ్యాయామాలు చేయడం వల్ల శరీరానికి దృఢత్వం, మనసుకు ప్రశాంతత, జీవితానికి సానుకూల దృక్పథం లభిస్తాయని తెలిపారు.యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని, మనస్సు, శరీరం, ఆత్మలను ఏకం చేసే భారతీయ సంస్కృతికి చెందిన మహోన్నత జీవన విధానమని వివరించారు. యోగా ద్వారా రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని చెప్పారు.తమ ప్రభుత్వ హయాంలో రాయచోటి పట్టణంలోని డైట్ మున్సిపల్ పార్కులో ప్రత్యేక యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకువచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాగే ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో ఉదయం, సాయంత్రం వేళల్లో నడకలు, వ్యాయామాలు చేసుకునేందుకు డైట్ మున్సిపల్ పార్క్, నగరవనం వంటి సౌకర్యాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు.భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం యోగా అని, నేడు అంతర్జాతీయ స్థాయిలో యోగాకు అపార గౌరవం, ఆదరణ లభించడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర అన్ని స్థాయిల్లో యోగా ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ యోగాను ఆచరించేలా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరింత కృషి చేయాలని కోరారు."ఆరోగ్యమే మహాభాగ్యం.. యోగానే ఆరోగ్యానికి రాజమార్గం" అని పేర్కొంటూ ప్రజలందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
21 - 06 - 2026

# శిల్పారామంలో నేడు సాయి బ్యాచ్' కోలాట ప్రదర్శన




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 20:-**స్థానిక శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నేడు ప్రత్యేక కోలాట ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు శిల్పారామం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.పులివెందుల పార్నపల్లి రోడ్డులోని మొదటి సాయిబాబా ఆలయానికి చెందిన సాయి కోలాటం బ్యాచ్ సభ్యులు ఈ ప్రదర్శన ఇవ్వనున్నారు.ఈ ప్రదర్శనకు కోచ్‌గా మల్లికార్జున వ్యవహరిస్తున్నారన్నారు.మన సాంప్రదాయ కళలను భవిష్యత్తు తరాలకు అందించడం, ప్రోత్సహించడంతో పాటు పట్టణ ప్రజలకు చక్కని సాంస్కృతిక వినోదాన్ని పంచడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సాంస్కృతిక ప్రదర్శనకు పట్టణ ప్రజలు,కళాభిమానులు,మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేసి, కళాకారులను ప్రోత్సహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విశ్వనాథరెడ్డి కోరారు.

# టీటీడీ ఆర్డర్ తో ఉపాధి, వెంకన్నకు సేవ: మంత్రి సవిత

**తాడేపల్లి/అమరావతి మన జనప్రగతి జూన్ 20:-** తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్డర్ తో ఉపాధితో పాటు కలియుగ దైవం వెంకన్నకు సేవ చేసే అవకాశం నేతన్నలకు కలిగిందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆప్కో చరిత్రలో గతంలో ఎన్నడూ టీటీడీ ఆర్డర్ రాలేదని, ఇది కూటమి ప్రభుత్వ విజయమని తెలిపారు. క్వాలిటీతో కూడిన చేనేత వస్త్రాలను టీటీడీకి సరఫరా చేయాలని, 45 రోజుల్లోనే చెల్లింపులు చేస్తామని మంత్రి సవిత తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆప్కో చరిత్రలోనే మొట్టమొదటిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఆర్డర్ వచ్చిందన్నారు. గతంలో తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ మాత్రమే టీటీడీకి చేనేత వస్త్రాలను సరఫరా చేసేదన్నారు. కూటమి ప్రభుత్వం జోక్యంతో ఆప్కోకు టీటీడీ ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఎనిమిది రకాలైన చేనేత, సిల్క్ వస్త్రాలను సరఫరా చేయాలని టీటీడీ నుంచి ఆర్డర్ వచ్చిందన్నారు. మగ్గం మీద నేసే ఉత్తరీయం వస్త్రాలు,



5.50 మీటర్ల పట్టు చీరలు, 6 గజాల పట్టు చీరలతో పాటు పవర్ లూమ్ మీద నేసే సిల్క్, పాలిస్టర్ దుశ్శాలువాలు, కాటన్ బ్లౌజ్ లు తదితర వస్త్రాలను టీటీడీకి సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. క్వాలిటీతో కూడిన వస్త్రాలకు మాత్రమే టీటీడీ అనుమతిస్తుందన్నారు. ఈ ఎనిమిది రకాల వస్త్రాలను పంపిణీ చేసిన 45 రోజుల తరవాత ఆప్కో ద్వారా చెల్లింపులు చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన చేనేత సంఘాల ప్రతినిదులు ముందుకు రావాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. టీటీడీ ఆర్డరే కాకుండా ఇతర సంక్షేమ శాఖల నుంచి కూడా త్వరలో ఆర్డర్లు రానున్నాయన్నారు. నేతన్నలకు 365 రోజులూ ఉపాధి కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. టీటీడీ వస్త్రాల సరఫరాతో నేతన్నలకు ఉపాధితో పాటు వెంకన్నకు సేవ చేసే అవకాశం కలిగిందని మంత్రి సవిత అభిప్రాయపడ్డారు. చేనేత, జౌళి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ, టీటీడీకి నాణ్యత కలిగిన వస్త్రాలను సరఫరా చేయాలని, లేకుంటే తిరస్కరిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ముందుకొస్తే, టీటీడీ ఆర్డర్ ప్రకారం వస్త్రాల సరఫరాకు అవకాశమిస్తామన్నారు. ఏయే వస్త్రానికి ఎంతమేర టీటీడీ ధర చెల్లించనుందో కమిషనర్ రేఖారాణి వివరించారు. రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన చేనేత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అండగా 'అన్నదాత సుఖీభవ': మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి మన జనప్రగతి జూన్ 20:-** రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవపీఎం కిసాన్' పథకం ద్వారా రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పల్నాడు జిల్లా లింగంగుంట్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ పథకం కింద అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు అందిస్తున్నాయని చెప్పారు. ఈ ఏడాది తొలి విడతగా రాష్ట్రవ్యాప్తంగా 46.85 లక్షల రైతు కుటుంబాల ఖాతాల్లో రూ.3,125.47 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగం దెబ్బతిందని, ప్రస్తుతం భూసార పరిరక్షణ, డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం వంటి కార్యక్రమాలను పునరుద్ధరించి రైతులకు అందిస్తున్నామని తెలిపారు. తోతాపురి మామిడి, పొగాకు, కోకో, ఉల్లి రైతులకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.యూరియా, డీఏపీ ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# నెల్లూరులో ఘనంగా కూటమి విజయోత్సవ సభ



**నెల్లూరు మన జనప్రగతి జూన్ 20:-** నెల్లూరు నగరంలోని మైపాడు గేట్ సెంటర్ కేపీఆర్ మండపంలో శనివారం నిర్వహించిన కూటమి రెండేళ్ల విజయోత్సవ సభ భారీ జనసందోహంతో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో వేగంగా ముందుకు సాగుతోందన్నారు.గత ప్రభుత్వం వదిలిన ఆర్థిక భారాన్ని అధిగమిస్తూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలుతో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తోందని తెలిపారు. అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పెట్టుబడుల ఆకర్షణలో ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు.నెల్లూరు నగరంలో భగత్‌సింగ్ కాలనీ సమస్య పరిష్కారం, అమృత్ 2.0 పనులు, ఇంటింటికీ తాగునీటి సరఫరా, పేద విద్యార్థులకు 8 వేల సైకిళ్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. నెల్లూరును రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.కార్యక్రమంలో మేయర్ సుజాత అశోక్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విదేశాల్లోనూ లేపాక్షి షోరూమ్‌లు ఏర్పాటు: మంత్రి సవిత

**అమరావతి మన జనప్రగతి జూన్ 20:-** రాష్ట్రంలోని నేతన్నలు, హస్తకళాకారులు గౌరవప్రదమైన జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. అమరావతిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ త్వరలో "నేతన్న భరోసా" పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామని, రాష్ట్రంలోని 50 వేలకుపైగా చేనేత కుటుంబాలు దీని ద్వారా లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. చేనేత రంగ అభివృద్ధికి క్లస్టర్లు, మెగా క్లస్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు.అమరావతిలో 10 ఎకరాల్లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో మరియు దేశవ్యాప్తంగా ఉన్న లేపాక్షి షోరూమ్‌లను ఆధునీకరిస్తున్నామని, త్వరలో విదేశాల్లో కూడా లేపాక్షి షోరూమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఆప్కో డిజిటలైజేషన్‌కు స్కోచ్ అవార్డు లభించిందని, చేనేత వస్త్రాల విక్రయాలను పెంచేందుకు పలు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.



# భువనేశ్వరి సేవలు ఎందరికో స్ఫూర్తి: మంత్రి సవిత



**అమరావతి మన జనప్రగతి జూన్ 20:-** నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు శనివారం తాడేపల్లిలోని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.మంత్రి మాట్లాడుతూ, నారా భువనేశ్వరి సామాజిక సేవా కార్యక్రమాలు, పేదల విద్య, ఆరోగ్య రంగాలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, రక్తదాన శిబిరాలు, విపత్తు సమయంలో సహాయక చర్యలు చేపడుతూ అనేక మందికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు.అలాగే రాజకీయ, సామాజిక రంగాల్లో ఆమె చూపిన ధైర్యసాహసాలు మహిళలకు, యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి,మన జనప్రగతి జూన్ 20:-** రైతు సంక్షేమం, సాగునీటి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాయచోటిలో నిర్వహించిన "అన్నదాత సుఖీభవపీఎం కిసాన్" కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, జిల్లాలో 1.64 లక్షల మంది రైతులకు తొలి విడతగా రూ.110.77 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు.రైతుల పెట్టుబడి భారం తగ్గించేందుకు సబ్సిడీలు, మైక్రో ఇరిగేషన్, జలధార పథకం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాయచోటి ప్రాంతంలో చెక్‌డ్యామ్‌లు, చెరువుల పునరుద్ధరణ, మాండవ్య నది అభివృద్ధి, తాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, కొత్త బస్టాండ్, ఇండోర్ స్టేడియం తదితర అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ, ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు నీటి పొదుపు పద్ధతులు, ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. రాయచోటి తాగునీటి సమస్యకు రూ.124 కోట్లతో శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో ఏపీఐసీ చైర్మన్ కే. భాస్కర్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్



**దేవనకొండ మన జనప్రగతి జూన్ 20 :-** దేవనకొండ మండలంలోరైతులకుమొదటి విడత నిధుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి బి. ఉషారాణి ముఖ్యంగా హాజరై, వివరాలు తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి అర్హత గల రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ. 20,000 ఆర్థిక సాయం అందనున్నట్లు తెలిపారు. మొదటి విడతగా దేవనకొండ మండలంలోని 15,220 మంది రైతులకు అన్నదాత సుఖీభవ క్రింద రూ. 7,61,00,000( ఏడు కోట్ల 61 లక్షలు), పిఎం కిసాన్ పథకం కింద 12063 మంది రైతులకు రూ. 2,41,00,000( రెండు కోట్ల 41 లక్షలు) మొత్తం కలిపి రూ. 10,02,00,000( 10 కోట్ల రెండు లక్షలు )నిధులు జమ కానున్నాయని వెల్లడించారు.కార్యక్రమానికి ,మాజీ ఎంపీటీసీ ఆకుల విరేష్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ రవికుమార్, వీరయ్య, టీడీపీ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున,రాజా సాబ్, మురళి తదితరులు అధికారులు ,మల్లికార్జున, అబ్దుల్ సలాం, గ్రామ వ్యవసాయ సహాయకులు కళావతి, హసీనా గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మద్దిలేటి స్వామి ఆలయానికి విరాళం

## - ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు



**బేతంచెర్ల మన జనప్రగతి జూన్ 20:-** బేతంచెర్ల మండలం ఆర్ ఎస్ రంగాపురం గ్రామ శివార్లో వెలసిన మద్దిలేటి స్వామి ఆలయానికి ఒక లక్ష రూపాయల విరాళం భక్తుడు నాగ కృష్ణ అందజేసినట్లు ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.... కర్నూలు పట్టానికి చెందిన భక్తులు నాగ కృష్ణ ఆయన భార్య రేణుక దేవి వారి కుమారుడు ఆలయ అభివృద్ధి కి ఈ విరాళం అందజేసినట్లు ఆయన తెలిపారు.

# బాల్య వివాహాలు చేయడం నేరం



**ఆళ్లగడ్డ మన జనప్రగతి జూన్ 20:-**

తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేయడం నేరమని జిల్లా నోడల్ అధికారిని ఉమామహేశ్వరమ్మ అన్నారు. ఆళ్లగడ్డ ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై, హెల్ప్ లైన్ నెంబర్ లపై అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారిని ఉమామహేశ్వరమ్మ బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. ఇందులో బాగస్వాములయ్యే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఫోక్సో చట్టం బాలికల రక్షణకు ప్రభుత్వం ఇచ్చిన ఆయుధం అన్నారు. మత్తు, డ్రగ్స్ కు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. బాలికలపై నేరాలు జరిగిన జరిగే అవకాశం ఉన్న వెంటనే 1098, 181, 14416 హెల్ప్ లైన్ నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఐసిడిఎ స్ సూపర్వైజర్ దస్తగిరమ్మ, అంగన్వాడి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక

21 - 06 - 2026

# స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు



**తొండూరు మన జనప్రగతి జూన్ 20:**–మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ గవాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రం ఆవరణతో పాటు పరిసర ప్రాంతాలను సిబ్బంది శుభ్రపరిచారు. అలాగే మండలంలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఆయా సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ గవాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాలయాలు, ఆరోగ్య కేంద్రాలు మరియు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని తెలిపారు. ప్రజల్లో కూడా పరిశుభ్రతపై అవగాహన కల్పించి ఆరోగ్య కేంద్రాలను స్వచ్ఛంగా ఉంచేందుకు సహకరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లయ్యతో పాటు ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు... మద్యం విక్రయిస్తున్న ముగ్గురు అరెస్టు




**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 20:**–అట్లూరు, ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల పరిధిలో అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం సిద్ధవటం ఎక్సైజ్ కార్యాలయంలో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీల్లో భాగంగా మూలపల్లి, జ్యోతి గ్రామాల్లో దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.1,800 ఉంటుందని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కూడా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థులకు గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

# మండల పరిషత్ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ ప్రారంభం




**వీరబల్లి మన జనప్రగతి జూన్ 20:**– మండల పరిషత్ నిధుల వినియోగంపై రాజంపేట డివిజనల్ స్థానిక సంస్థల అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) నరసింహమూర్తి శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర విచారణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి (సీఈఓ) ఆదేశాల మేరకు ఈ విచారణ చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా 2025 జూన్ 1 నుంచి ఇప్పటివరకు మండల పరిషత్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటికి సంబంధించిన నిధుల వినియోగం, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. విచారణ పూర్తయిన అనంతరం సమగ్ర నివేదికను వైఎస్సార్ కడప జిల్లా జడ్పీ సీఈఓ శ్రీ సుబ్రహ్మణ్యంకు సమర్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ విచారణలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జూలై 7న చలో ఈదుమూడి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### - ఎమ్మార్పీఎస్ నేత పులికొండ మాదిగ



**పత్తికొండ మన జనప్రగతి జూన్ 20:**–ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో జూలై 7న నిర్వహించనున్న మాదిగల పుణ్యక్షేత్ర శంకుస్థాపన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బురుజుల పులికొండ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం పత్తికొండ మండలంలోని దేవనబండ గ్రామంలో లక్ష్మణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదిగల హక్కుల సాధన, సంక్షేమం కోసం ఎమ్మార్పీఎస్ ఎన్నో ఉద్యమాలు నిర్వహించిందని, ఏబీసీడీ వర్గీకరణ సాధనలో సంస్థ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈదుమూడిలో జరగనున్న మాదిగల పుణ్యక్షేత్ర శంకుస్థాపన మహోత్సవానికి ప్రతి గ్రామం నుంచి మాదిగలు, ఉపకులాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బొంతల నరసింహులు, ముత్యాల ప్రసాద్, నరసింహులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణ, మానవ హక్కుల రక్షణకు సీఐ శ్రీరామ్ అంకితభావం

### • సీఐ శ్రీరామ్‌కు ఉత్తమ సేవా రత్న అవార్డు ప్రదానం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 20:**–సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల హక్కుల రక్షణకు నిరంతరం కృషి చేస్తున్న పులివెందుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సి.ఐ) శ్రీరామ్ కి అత్యంత ప్రతిష్టాత్మకమైన ఉత్తమ సేవా రత్న అవార్డు లభించింది. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కౌన్సిల్ ప్రతినిధులు ఆయనను ప్రశంసా పత్రం, అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేసి జాన్ పాల్ (ఎ.పి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా)సిరిగిరి కిరణ్ కుమార్ (రాయలసీమ విజిలెన్స్ సెల్ వైస్ చైర్మన్)రాజ కుళ్ళాయప్ప (కడప జిల్లా బిసి సెల్ చైర్మన్) పాల్గొన్నారు. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేసి జాన్ పాల్ మాట్లాడుతూ సీఐ శ్రీరామ్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి తన పరిధిలో నేరాల నియంత్రణకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వెనుకబడిన వర్గాల హక్కుల రక్షణకు ఆయన అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. చట్టాన్ని గౌరవిస్తూ, మానవతా దృక్పథంతో వారు అందిస్తున్న సేవలు సమాజానికి ఆదర్శంగా నిలిచాయని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాయలసీమ విజిలెన్స్ సెల్ వైస్ చైర్మన్ సిరిగిరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో పోలీస్ వ్యవస్థ పాత్ర చాలా కీలకమైనదని శాంతిభద్రతలు కాపాడటంతో పాటు, సాధారణ ప్రజల హక్కులకు భంగం కలగకుండా చూడటంలో సీఐ శ్రీరామ్ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారని కొనియాడారు. కడప జిల్లా బిసి సెల్ చైర్మన్ రాజ కుళ్ళాయప్ప మాట్లాడుతూ సీఐ శ్రీరామ్ ఒక అధికారిలా కాకుండా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే ఒక బాధ్యతాయుతమైన రక్షకుడిగా సేవలందిస్తున్నారని ఆయన చేసిన నిస్వార్థ సేవలను, విధి నిర్వహణలో చూపిన అంకితభావాన్ని గుర్తించి మా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆయనను ఉత్తమ సేవా రత్న అవార్డుకు ఎంపిక చేసింది అని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత సి.ఐ.శ్రీరామ్ మాట్లాడుతూ ఈ పురస్కారం తనపై బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. మానవ హక్కుల రక్షణలో ఎల్లప్పుడూ ముందుంటానని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. తన సేవలను గుర్తించి ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందించిన హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# లాకప్ మరణం ఘటనపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి: రాచమల్లు డిమాండ్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 20:**–రాష్ట్రంలో సంచలనం సృష్టించిన లాకప్ మరణం ఘటనపై మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ప్రొద్దుటూరులోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో పోలీసుల పనితీరు ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. దేశంలో లాకప్ మరణాలు, ఎన్‌కౌంటర్ ఘటనలు జరిగినప్పటికీ, లాకప్‌లో మరణించిన వ్యక్తి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించకుండా దహనం చేయడం అత్యంత దారుణమైన చర్య అని పేర్కొన్నారు. తన కుమారుడి మృతదేహం కాకపోయినా కనీసం బూడిద ఇవ్వాలని తల్లి వేడుకునే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ఒక వ్యక్తిని 15 రోజుల పాటు చిత్రహింసలకు గురిచేసే అధికారం పోలీసులకు, ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించిన ఆయన, ఈ ఘటనకు కేవలం స్థానిక సీఐ నాగరాజు మాత్రమే కాకుండా ఉన్నతాధికారులు, హోంశాఖ కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి వంగలపూడి అనిత పరిపాలనపై దృష్టి పెట్టకుండా రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు. ఇంతటి ఘోర ఘటన జరిగినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తర్వాతే ప్రభుత్వం కదిలిందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు పెరిగాయని, పోలీసు వ్యవస్థపై రాజకీయ ప్రభావం అధికమైందని ఆయన అన్నారు. లాకప్ మరణం కేసులో సంబంధిత అధికారులపై హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ ఘటనపై సీఐడీతో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన పోలీసు అధికారులు, ఉన్నతాధికారులపై కేసులు నమోదు చేసి శిక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నైతిక బాధ్యత వహిస్తూ హోంమంత్రి అనిత రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# పులివెందులలో ఘనంగా ‘అన్నదాత సుఖీభవ‘ కార్యక్రమం

### • లబ్ధిదారులకు రూ. 28.28 కోట్ల నిధుల విడుదల • రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం • పులివెందుల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ బి.టెక్ రవి




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 20:**స్థానిక ఇస్త్ర ఆడిటోరియం (వైస్సార్ విస్టా ఆడిటోరియం) లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో “అన్నదాత సుఖీభవ – రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం“ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. 2026–27 ఆర్థిక సంవత్సరపు తొలి విడత పంపిణీలో భాగంగా నిర్వహించిన ఈ సభకు పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బి.టెక్ రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల రైతులకు కలిపి మొత్తం రూ.28.28 కోట్ల విలువైన చెక్కులను విడుదల చేశారు. నియోజకవర్గం లో మొత్తం లబ్ధిదారులు 41,676 మంది రైతులకు రూ.28.28 కోట్లు అందింది. కేంద్ర ప్రభుత్వం (పీఎం కిసాన్ పథకం) ద్వారా రూ.6,000, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.14,000 కలిపి సంవత్సరానికి మొత్తం రూ. 20,000 చొప్పున మూడు విడతల్లో నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయి. సభలో ముఖ్య అతిథి బి.టెక్ రవి మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అని, అన్నదాత సుఖంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. నియోజకవర్గంలో సాగునీటి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. కుప్పానికి వెళ్లే హంద్రీనీవా కాలువ నుండి ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఎర్రబల్లి చెరువుకు నీరు ఆపకుండా ఇచ్చేలా ప్రత్యేక జీఓ తీసుకువచ్చాం అని రూ. 25 లక్షల ఖర్చుతో కాలువలను మరమ్మతు చేసి పత్తి రైతులకు నీరందించాం అన్నారు. చిత్రావతి, పైడిపాళ్యం రిజర్వాయర్లకు గండికోట నుండి తలా 2 టీఎంసీల నీటిని కేటాయించాలని కలెక్టర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని పంపుల మెయింటినెన్స్ కోసం రూ.3 కోట్లు అవసరం కాగా రూ. 1.5 కోట్లు వచ్చాయని మెకానిక్ ఒక్కరే ఉండటం వల్ల కొన్ని పంపుల రిపేర్ ఆలస్యమైందని ఈ వాస్తవాన్ని గ్రహించకుండా ఎంపీ అవినాష్ రెడ్డి ధర్నాలు చేయడం దారుణం అన్నారు. వెదర్ బేస్డ్ ఇన్సూరెన్స్ మిషన్లు దూరంగా ఉండటం వల్ల గాలివానలకు నష్టపోయిన అరటి రైతులకు బీమా అందడం లేదని అందుకే ప్రతి రెండు గ్రామాలకు ఒక వెదర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్, ఇంచార్జ్ మంత్రిని కోరాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు రసాయన ఎరువుల వాడకంపై ఆందోళన వ్యక్తం చేశారు. రసాయన ఎరువుల వల్ల క్యాన్సర్, గ్యాస్ ట్రబుల్, బీపీ, షుగర్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయి. దీనికి విరుగుడు ప్రకృతి వ్యవసాయమే అని కేవలం లాభాల కోసమే కాకుండా ప్రజల ఆరోగ్యం కోసం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వాడాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం నుండి పూర్తి సహకారం ఉంటుంది అని అధికారులు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా రైతులకు, ప్రజలకు నిరంతరం సేవ చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని కూటమి నాయకులు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో నూర్ బాషా సంఘం రాష్ట్ర చైర్మన్ ముక్తియార్, కడప జిల్లా గ్రంథాలయ చైర్మన్ భాను ప్రకాష్, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ అమరనాథ్ యాదవ్, తుంగభద్ర ప్రాజెక్టు హైలెవల్ కమిటీ చైర్మన్ జోగిరెడ్డి, జనసేన నాయకుడు హరీష్, బీజేపీ నాయకుడు నవీన్ కుమార్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, వివిధ మండలాల ఏఓలు, ఏఈఓలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174